www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శని వారం, 12 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-188 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# టీఎస్ ఐపాస్ పెట్టుబడులకు పెద్దపీట

## మంత్రి కెటిఆర్‌తో తైవాన్ బృందం భేటీ






**హైదరాబాద్, నవంబర్ 11 (సమ సమాజం):** చిన్న, మధ్య తరహా సంస్థలకు సలహాలు, సూచనలు ఇస్తూ సహాయం చేయాలని తైవాన్ వ్యాపార ప్రతినిధి బృందాన్ని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కోరారు. తైవాన్ భారతదేశ ప్రతినిధి బౌషన్ గేర్ ఆధ్వర్యంలో తైవాన్ వ్యాపార ప్రతినిధి బృందం కేటీఆర్‌తో శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో లైఫ్ సైన్సెస్, ఐసీటీ సహా శక్తివంతమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ తెలంగాణలో ఉందని కేటీఆర్ తైవాన్ బృందానికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన టీఎస్ ఐపాస్ పెట్టుబడులకు బాటలు వేసిందన్నారు. పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం హైదరాబాద్ అని స్పష్టం చేశారు. పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భారీ పెట్టుబడులతో వస్తే పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## రాజీవ్ హంతకుల విడుదల

### సుప్రీం తీర్పుపై కాంగ్రెస్ అసంతృప్తి



**న్యూఢిల్లీ,నవంబర్11(సమ సమాజం):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హంతకులను విడుదల చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడంపై కాంగ్రెస్ పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును స్వాగతించడంలేదని ఆ పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి, జనరల్ సెక్రటరీ జైరాం రమేష్ అన్నారు. 3లో

## నిజాం విద్యార్థుల తీరుపై సబిత అసహనం

### ఫిఫ్టీ..ఫిఫ్టీకి ఒప్పుకున్నాక మళ్లీ తిరకాసు ఏమిటి



**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** నిజాం కాలేజ్ విద్యార్థుల ఆందోళనపై విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. విద్యార్థులు ఉదయం 50శాతం హాస్టల్‌కు అంగీకరించి.. ఇప్పుడు మళ్లీ ఆందోళన చేయడం కరెక్ట్ కాదన్నారు. విద్యార్థులు రాతపూర్వక హామీ కావాలన్నారని..అందుకే అధికారిక ఉత్తర్వులు ఇచ్చామని స్పష్టం చేశారు. 3లో

## ప్రధాని పర్యటనకు సిఎంను ఇలాగేనా పిలిచేది

### సిఎం కెసిఆర్‌కు ఆహ్వానంలో ప్రోటోకాల్ పాటించలే

### ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్

### కెసిఆర్ తీరును తప్పుపట్టిన వివేక్



**కరీంనగర్, నవంబర్ 11 (సమ సమాజం):** రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సీఎంను పిలిచే విషయంలో సరైన ప్రోటోకాల్ పాటించలేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు 3లో

## మునుగోడు హామీలను నెరవేర్చే వరకు వెంటపడతా

### మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వెల్లడి



**నల్లగొండ, నవంబర్ 11 (సమ సమాజం):** టీఆర్ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడి మునుగోడులో గెలిచిందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు. మునుగోడులో మొదలైన యుద్ధం కేసీఆర్‌ని గద్దె దింపే వరకు కొనసాగుతుందన్నారు. కుటుంబపాలనకు చరమగీతం పాడే రోజు దగ్గర్లోనే ఉందని చెప్పారు. మునుగోడులో ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే 3లో

## రాష్ట్రంలో ప్రాథమిక వైద్యరంగం బలోపేతం

### పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ కార్యాలయంలో మానిటరింగ్ హబ్

### సిసి కెమెరాలతో కార్యాలయాల అనుసంధానం

### త్వరలోనే డాక్టర్ పోసుల భర్తీకి చర్యలు

### మంత్రి హరీష్ రావు వెల్లడి



**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** రాష్ట్రంలో ప్రాథమిక వైద్యరంగాన్ని సీఎం కేసీఆర్ బలోపేతం చేస్తున్నారని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ కార్యాలయంలో మానిటరింగ్ హబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని 887 పీహెచ్‌సీల్లోని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, టీఎస్ఎంఎస్ఐడీసీ అనుసంధానం చేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారులు ఎక్కడి నుంచైనా మానిటర్ చేసే అవకాశం కలుగుతుందన్నారు. ఏవైనా ఔట్ బ్రేక్ కలిగిన సమయంలో సలహాలు సూచనలు ఇస్తారన్నారు. డాక్టర్లు ఆయా పీహెచ్‌సీలోని ఫార్మసీ, ల్యాబ్‌ను మాటనిటర్ చేసే అవకాశం కలుగుతుందన్నారు. మెడికల్ కాలేజీలు, జిల్లా హాస్పిటల్‌తో సంప్రదించి స్పెషాలిటీ సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. సీసీ కెమెరాలతో సెక్యూరిటీ, సేఫ్టీ ఉంటుందని, ఇలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయడం దేశంలో మొదటిసారన్నారు. 43 పీహెచ్‌సీలకు రూ.67కోట్లతో కొత్త బిల్డింగ్‌లను మంజూరు చేసినట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 372 3లో

## దక్షిణాదిలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్

### చెన్నై-మైసూరు మధ్య నడిచే రైలుకు మోడీ పచ్చజెండా




**బెంగళూరు,నవంబర్11(సమ సమాజం):** దక్షిణాదిలో తొలిసారిగా చెన్నై-మైసూరు మధ్య నడిచే వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును ప్రధాని నరేంద్ర మోడీ జెండా ఊపి ప్రారంభించారు. బెంగళూరులోని క్రాంతివీర సంగొల్లి రాయన్న రైల్వే స్టేషన్‌లో మోడీ జెండా ఊపారు. ఇండస్ట్రీరియల్ హబ్ అయిన చెన్నై, బెంగళూరులోని టెక్ స్టార్టప్ హబ్, ప్రసిద్ధ పర్యాటక నగరం మైసూరు మధ్య కనెక్టివిటీని వందే భారత్ రైలు మెరుగు పరుస్తుందని పీఎంవో తెలిపింది. బెంగళూరులోని కేఎస్ఆర్ రైల్వే స్టేషన్ లో భారత్ గౌరవ్ కాశీ దర్శన్ రైలును ప్రధాని మోడీ జెండా ఊపి ప్రారంభించారు. 3లో

## నేడు రామగుండానికి ప్రధాని మోడీ రాక

### బేగంపేట పరిసరాల్లో మధ్యాహ్నం నుంచి ఆంక్షలు



**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. శనివారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఆంక్షలు ఉంటాయి. పంజాగుట్ట, గ్రీన్ ల్యాండ్స్, ప్రకాష్ నగర్, రసూల్ పుర, ప్యాట్నీ సిగ్నల్ వరకు ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ఛాన్స్ ఉంది. సోమాజిగూడా,రాజ్ భవన్ రోడ్, ఖైరతాబాద్ జుంక్షన్ వరకు ట్రాఫిక్ ఉండే అవకాశాలు ఉన్నాయి. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 7 3లో

## మోడీ వస్తే ముఖం చాటేయడం దేనికి?

### అనేక విషయాల్లో నిలదీస్తే బాగుండేది: జీవన్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 11 (సమ సమాజం):** కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌తో చర్చలు జరిపి మూతపడ్డ మూడు ఎరువుల కర్మాగారాలను ప్రారంభించామని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. . బీజేపీ ప్రభుత్వం చేసిన నల్ల చట్టాలకు అప్పటి టీఆర్ఎస్ ఎంపీలు కవిత, బాల్క సుమన్, వినోద్ వత్తాసు పలికారని 3లో

## టీఆర్ఎస్‌లో చేరిన బిజెపి కార్పోరేటర్

### కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ కవిత





**నిజామాబాద్,నవంబర్11(సమ సమాజం):** నిజామబాద్ నగరానికి చెందిన 45వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ ఆకుల హేమలత శ్రీనివాస్ టీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణెళిశ్ బిగాల సమక్షంలో పార్టీలో చేరిన ఆమెకు టీఆర్ఎస్ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా 3లో

## నేడు యధావిధిగా స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులు

### రెండో శనివారం సెలవు రద్దు చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** నేటి రెండో శనివారం సెలవును ప్రభుత్వం రద్దు చేసింది. ఈ కారణంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండదు. ఈ నెలలోని రెండో శనివారంలో మాత్రం సెలవు రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నేడు స్కూళ్లు, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు యధావిధిగా పని చేస్తాయని స్పష్టం చేసింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, కాలేజీలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని చెప్పింది. గణెళిశ్ నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 9వ తేదీని ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించింది. ఆ సెలవును భర్తీ చేసేందుకు రెండో శనివారం పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే ఈ నెల 12న సెలవు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## నేడు హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు

### ఎగ్జిట్ పోల్స్‌ను నిషేధించిన ఎన్నికల సంఘం





**న్యూఢిల్లీ,నవంబర్11(సమ సమాజం):** భారత ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం తీసుకుంది. హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌లలో త్వరలో జరగబోతున్న ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్‌పోల్ అంచనాల ప్రసారం, ప్రచురణను నిరోధించేలా భారత ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది.హిమాచల్‌లో నవంబర్ 12వతేదీన, ప్రధాని నరేంద్ర మోదీ స్వస్థలమైన గుజరాత్‌లో డిసెంబర్ 1, 8 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 12వ తేదీ 3లో

## హిమాచల్ ఓటర్లకు ప్రధాని మోడీ వినతి

### డబుల్ ఇంజన్ కొనసాగాలంటూ లేఖ

### కేంద్ర పథకాలు అమలు కావాలంటే గెలిపించాలని వినతి



**న్యూఢిల్లీ,నవంబర్11(సమ సమాజం):** హిమాచల్‌ప్రదేశ్‌లో పోలింగ్‌కు ఒక రోజు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఓటర్లకు లేఖ రాశారు. ఎన్నికలకు ముందు ఉన్న కొండ ప్రాంతమైన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం వస్తే అభివృద్ధి సాగుతుందని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధిని వేగవంతం చేసిందని మోదీ పేర్కొన్నారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హిమాచల్ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే మళ్లీ 3లో

## సంపాదకీయం

# విశాఖ ఉక్కుపై మోడీ చిత్తశుద్ధి ప్రకటించాలి !

ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కార్పోరేట్లకు కట్టబెట్టే ముందు..వాటిని ఎప్పులు ఎలా ప్రారంభించారో.. వాటి నేపథ్యం ఏమిటో..అందులో ఎంతమంది పనిచేస్తున్నారో..ఇంకెంతమందికి దాని ద్వారా ఉపాధి కల్పించ వచ్చో అన్న విషయాలను ప్రభుత్వాలు ఆలోచనచేయాలి. విశ్శాఖ ఉక్కు, గంగవరం పోర్టుల నిర్మాణంలో సామాన్యుల చెమట ఇమిడి ఉంది. స్థానికుల త్యాగం ఉంది. అధికారం ఉంది కదా అని ఇలాంటి సంస్థలను తెగనమ్మడం పాడియావును కోతకు అమ్మడం లాంటిదే. కన్నతల్లిని నడిబజారులో వదిలేయడం లాంటిదే. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటులో సామాన్యుల పోరాటం, త్యాగాలు దాగి ఉన్నాయి. గంగవరం పోర్టు ఏర్పాటులో కూడా ఇలాంటి త్యాగాలు ఉన్నాయి. మత్స్యకార పల్లెలు తమ గూడును వదిలి వెళ్లాల్సి వచ్చింది.నిజంగానే ఇవి ప్రైవేట్‌కు అప్పగించాల్సి ఉంటే ఏర్పాటు సమయంలోనే ప్రైవేట్ వాళ్లను ప్రోత్సహించాల్సింది. కానీ అలా కాకుండా ప్రభుత్వరంగంలో ప్రజల కోరిక మేరకు ఏర్పాటు చేసి..అందులో వారిని భాగస్వామ్యం చేసి....వారి భూములను తీసుకుని ఇప్పుడు ఎవరో ఒకరికి కట్టబెట్టడం దారుణం కాక మరోటి కాదు. ప్రధాని మోడీ ఇంతవరకు ఈ రెండు సంస్థలపై మాట్లాడలేదు. ప్రజాస్వామ్యంలో నమ్మకం ఉంటే విశాఖ వస్తున్న మోడీ ఈ విషయాలపై మాట్లాడాలి. రెండ్రోజుల విశాఖ పర్యటనకు ప్రధాని మోడీ వస్తున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత మొదటిసారి మోడీ విశాఖ వస్తున్నా రు. గత రెండేళ్లుగా దీనిపై తీవ్రమైన ఆందోళనలు సాగుతున్నాయి. రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో వివరించాలి. శనివారం 12న మోడీ ప్రసంగించే బహిరంగ సభలో 'విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మం, గంగవరం పోర్టు ప్రైవేటీకరణలపై చర్చించాలి. ప్రజల ఆందోళనలను అర్థం చేసుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఇదే ముఖ్యమని గుర్తించాలి. మోడీ విశాఖలో పర్యటించనున్న సందర్భంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు విధులు బహిష్కరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసింది. అయితే కేంద్రంతో లాలూచి పడుతున్న జగన్ ప్రభుత్వం నిజాయితీగా స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడడం లేదు. ఆ విశ్వాసం ప్రజల్లో, కార్మికుల్లో కూడా లేదు. 32 మంది ప్రాణత్యాగం చేసి సాధించు కున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోవడం రాష్ట్ర ప్రజల కర్తవ్యంగా సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం వచ్చి 8 సంవత్సరాలైనా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. కొత్త పరిశ్రమలు రాలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకుండా చావో రేవో తేల్చుకోవడానికి ప్రజలు సిద్ధం అయిన వేల ప్రధాని మోడీ ఉదాత్త నిర్ణయం తీసుకుని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేయడం ద్వారా మరికొన్ని వేలమందికి ఉపాధి మార్గంగా చూడాలి. అప్పుడే మోడీ నిజాయితీని ప్రజలు నమ్ముతారు. నిజానికి విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ప్రయత్నాలు కొత్తవేమీ కాదు. 1991లో సరళీకరణ విధానాల ఆరంభం నుంచి సాగుతున్న కుట్రకు కొనసాగింపే నేటి విశాఖ స్టీల్ పూర్తి అమ్మకపు ప్రక్రియగా భావించాలి. విశాఖ స్టీల్ కార్మికవర్గం అడుగడుగునా దాన్ని తిప్పికొట్టింది. 2000 సంవత్సరంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న కాలంలో విశాఖ స్టీల్ ను సిక్ పరిశ్రమగా ప్రకటించి వేలం వెయ్యాలని నిర్ణయించింది. నాటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కూడా విశాఖ స్టీల్‌ను సిక్ పరిశ్రమగా అమ్మాలనే విధానాన్ని గట్టిగా సమర్ధించారు. ఇప్పుడు జగన్ అదే పని చేస్తున్నారు. కాని కార్మికులు, కార్మిక సంఘాలు అడుగడుగునా పోరాడి కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పి కొట్టారు. విశాఖ స్టీల్ పోరాటంలో ఆనాడు విశాఖ స్టీల్ కార్మికులు ఒక్కరే పోరాడారు. కానీ తాజా పరిణామల్లో రాష్ట్రం అంతా ఒక్కటై పోరాడుతున్నది. అయితే కేంద్రంలోమోడీ ప్రధానిగా వచ్చినప్పటి ప్రభుత్వరంగ సంస్థను తెగగనమ్మే ప్రక్రియను వేగంగా చేపట్టారు. అప్పటి నుంచి విశాఖ స్టీల్‌ను ప్రైవేట్ చేసే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. 2017 నుంచి దక్షిణ కొరియా పోస్కో కంపెనీతో లోగుట్టు ఒప్పందా లు సాగాయన్న ప్రచారం సాగుతోంది. . 2018లో పోస్కో దూతలు విశాఖలో అడుగు పెట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 4 వేల ఎకరాల భూములు పోస్కోకు స్వాధీనం చేస్తే...5 మిలియన్ టన్నులు అదనంగా ఉత్పత్తి చేసే మరో స్టీల్‌ప్లాంట్‌ను రూ.25 వేల కోట్లతో నిర్మిస్తామని నమ్మబలికారు. 2019లో పోస్కో ప్రతినిధులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. కడపలో స్టీల్‌ప్లాంట్ పెట్టమన్న ముఖ్యమంత్రి కోర్కెను పోస్కో కంపెనీ ఖాతరు చేయలేదు. జగన్‌పై ఒత్తిడి తెచ్చి మోడీ జాయింట్ వెంచర్‌కు ఒప్పించారు. కాని కోవిడ్ వచ్చిన తర్వాత భూమి ఒక్కటే కాదు. మొత్తం స్టీల్‌ప్లాంట్‌ను తమకు స్వాధీనం చేయాలనే పోస్కో కంపెనీ డిమాండ్‌ను మోడీ అంగీకరించి 2021 జనవరి 27న విశాఖ స్టీల్ పూర్తి అమ్మకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. కోవిడ్ కాలంలో ఎవరూ నోరెత్తరని భావించిన బిజెపి ఈ కుట్రకు తెరతీసిందనే భావించాలి. నిజానికి ఈ భూములు రైతులు త్యాగం చేసినవి. నిజానికి కడప ఉక్కు ఫ్యాక్టటీ, బయ్యారం ఫ్యాక్టరీకి విభజన ఒప్పందంలో హామీ ఉంది. ఈ రెంటిని వదిలి ఉన్న ఒక్క స్టీల్ ప్లాంట్‌ను అమ్మాలనుకోవడం పాలపొదుగు ను కోయడం తప్ప మరోటి కాదు. ఈ రెండు ప్రాంతాల్లో ఉన్న ఐరన్ ఓర్‌ను సేకరించి విశాఖ స్టీల్‌ను బలోపేతం చేసివుంటే మోడీ చిత్తశుద్ధిని ప్రజలు నమ్మేవారు. కానీ కొత్తగా రెండు ఫ్యాక్టరీల ఏర్పాటును పక్కన పెట్టి, ఉన్నదానికే ఎసరు పెట్టే పాలకులను ఏమనుకోవాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలహీన పరచి కారుచౌకగా అమ్మాలనేది కేంద్ర ప్రభుత్వ కుట్ర తప్ప మరోటి కాదు. దీనిని ఉపసంహరించుకుని, బలోపేతం చేయడం ద్వారా కొత్తగా ఉపాధి, ఉద్యోగ రంగాలను సృష్టించాలి. అప్పుడే మోడీని ప్రజలు నమ్ముతారు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# మునుగోడు ఫలితంతో మరింత బాధ్యతతో సాగాలి

సరికొత్త తెలంగాణ ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలి ● నిరుద్యోగం, ఆరోగ్య రంగాలపై ప్రధాన దృష్టి పెట్టాలి

**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక గెలుపుతో ఇప్పుడు అందరి ఆశలను తీర్చాల్సిన బాధ్యత సిఎంగా కెసిఆర్ పై ఉంది. తెలంగాణ ఈ ఎనిమిదేళ్లలో కన్నా మరింత ప్రగతి సాధనలో ముందుకు సాగాల్సిన తరుణమిది. వ్యక్తిగత ప్రతిష్టగా తీసుకోకుండా సాగాల్సిన అవసరాన్ని మునుగోడు ఉప ఎన్నిక ఫలితం చూపింది. ప్రజలు కెసిఆర్ పట్ల నమ్మకం వ్యక్తం చేస్తున్నారనడానికి ఇంతకన్నానిదర్శనం అక్కర్లేదు. అందువల్ల సమస్యల పట్ల పట్టువిడుపు ధోరణితో సాగాల్సిన సమయమిది. సరికొత్త తెలంగాణ ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాలి. చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా సరికొత్త ఆలోచనలతో కార్యక్రమాలు సాగాల్సి ఉంది. పెండింగ్ పనులను పూర్తి చేసుకుంటూనే ప్రధానంగా నిరుద్యోగం, ఆరోగ్య రంగాలపై ప్రధాన దృష్టి సారించాల్సి ఉంది. మునుగోడు ఉప ఎన్నికకు ముందు ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా ముక్కుసూటిగా తాను చెప్పదల్చుకున్నది ప్రజలకు చెప్పారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యం.... కొత్తగా ఏర్పడ్డ తెలంగాణలో టిఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు.. మళ్లీ ఆశీర్వదించండని కోరడంతో ప్రజలు కెసిఆర్‌నే నమ్మారు. కనుక వారికి సంక్షేమాలు అందాలంటే కొంత త్యాగం చేయక తప్పదు. మునుగోడు ఎన్నికలో గెలుపు ద్వారా తన ప్రణాళికలను అమలు చేయించగల ఉద్ధండుడిగా మరోమారు కేసీఆర్ నిరూపించారు. నిరంతర కరెంట్ కెసిఆర్ సాధించిన అతిపెద్ద విజయంగా చెప్పుకోవాలి. చెరువుల పునరుద్దరణ, మిషన్ భగీరథ, ప్రాజెక్టుల నిర్మాణం తదితర అంశాలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రజలు ముందు కనిపిస్తున్న విజయాలు. తెలంగాణ పురోభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తెరాస ప్రభుత్వాన్ని ప్రజలు దీవించారు. తెలంగాణ అభివృద్ధి, ఆదాయ ప్రగతి ఎట్టిపరిస్థితులో ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత కూడా కెసిఆర్‌పైన ఉంది. నిరుద్యోగలుకు ఉద్యోగాల కల్పన, స్వయం ఉపాధి పథకాలు పెద్ద ఎత్తున చేపట్టాలి. తెలంగాణలో ఎన్నో వనరులు ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే ఇదేమంత పెద్ద కష్టమైన పని కాదు. యువతలో నిరుత్సాహం, బాధ ఉన్నాయని స్వయంగా చెప్పిన కెసిఆర్ ఈ వైపు ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప ఈ లక్ష్యం సాధ్యంకాదు. వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెంచే ప్రయత్నం చేస్తామని ఇచ్చిన భరోసా మేరకు కృషి జరగాలి. ఉద్యోగ ఖాళీలను వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని, అనుమానం పెట్టుకోవద్దన్న నమ్మిక కలిగించాలి. ప్రభుత్వేతర రంగాల్లోనూ విరివిగా ఉపాధి లభించేలా టీఎస్ ఐపాస్.. ఐటీలలో ఉన్న అవకాశాలతో ప్రయత్నం చేసారు. నిజానికి వ్యవసాయానుబంధ రంగాలను విస్తరించి ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చు. అందుకు తగిన వనరులు ఉన్నాయి. దీంతో ఉపాధి పెరుగుతుంది. ఇప్పటికే 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు బీమా అమలు చేస్తున్నందున అనుబంధ రంగాలను అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. అనుత్పాదక రంగాలకు సంబంధించి కొంత ధైర్యంగా పోవాలి. కిలో రూపాయి బియ్యం ప్రభుత్వ ఖజానాకు గుదిబండగా మారింది. ఇది కొందరి జేబులు నింపే కార్యక్రమంగా సాగుతోంది. మరికొందరికి ఆదాయవనరుగా ఉంది. ఇలాంటి పథకం వల్ల ప్రభుత్వ సొమ్ము వృధా అవుతోంది. దీనిని అరికట్టాల్సి ఉంది. సిఎం కెసిఆర్ ఇలాంటి గుదిబండ పథకాలను పెకిలించాలి. ఎందుకంటే ఇప్పుడు సంక్షేమానికి మరిన్ని నిధులు వెచ్చించాలి. పెన్షన్లను డబులు చేస్తామని హామీ ఇచ్చారు. రూ. 2,000 పింఛనుతో ధీమాతో బతికేలా.. ఎవరూ చేయిజాచి బతికే అవసరం లేకుండా చేశారు. సంపూర్ణ ఆరోగ్య తెలంగాణ దిశగా ప్రతి వ్యక్తి రికార్డు తయారు చేస్తామన్నారు. ఈఎన్‌టీ, దంతాలు, అత్యుత్తమమైన ఆరోగ్య పరీక్షలను చేపట్టి ప్రజలందరి రికార్డు తయారు చేసే కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంది. ఇవన్నీ ముందుకు సాగాలంటే ప్రభుత్వ ఖజానాలో డబ్బులు ఉండాలి. ఈ విషయంలో చర్చ చేసి కిలోబియ్యం లాంటి పథకాన్ని సరళీకరించాలి. ప్రజల సహకారంతో అంకితభావంతో పని చేస్తామని చెప్పిన దరిమిలా ఇక ఈ ఏడాది కాలం ప్రధాన సమస్యలపైనే పోరాడితే మంచిది. ప్రజలకు ఉచిత పథకాలను కొంతయినా తగ్గించుకోవాలి. తెరాస ప్రభుత్వం ఉన్నంతకాలం రైతుబంధు అమలవుతుందని స్పష్టం చేయడంతో భూమి ఉన్న వారికి మళ్లీ భరోసా నింపారు. నిజానికి ఇప్పటికే అనేక గ్రామల్లో నిరంతర నీటి సరఫరా జరుగుతోంది. ఇవ్వని హామీలనూ అమలు చేస్తున్న ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పాలి. ఇవన్నీకూడా రానున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ ఘన విజయానికి దోహదపడతాయన్న భరోసా ఏర్పడింది. ఇప్పుడు మళ్లీ అదే ఉత్సాహంతో ముందుకు సాగాలి. ప్రజలను విశ్వాసంలోకి తీసుని ముందుకు సాగితే అపజయాలు ఉండవని మునుగోడు నిరూపించిందని గుర్తించాలి.

# తమిళనాడులో భారీ వర్షాలతో అతలాకుతలం

**మూతపడ్డ పాఠశాలలు,కళాశాలలు**

**చెన్నైలో కాలనీలోల నీరు చేరడంతో పెళ్లివారికి తీవ్ర ఇక్కట్లు**



**చెన్నై,నవంబర్11(సమ సమాజం):** తమిళనాడులో వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో చెన్నైతో పాటు తిరువళ్లూరు జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు.తమిళనాడులోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. చెన్నైలోని తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గత వారం రోజులుగా చెన్నైతో పాటు చెంగల్పట్టు, తిరువళ్లూరు, కాంచీపురం, నాగపట్నం, తంజావూరు, తిరువల్లూరు జిల్లాలను వరుణుడు వణికిస్తున్నాడు. ఆ జిల్లాల్లో రికార్డ్ స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఇంతటి వర్షపాతం 30 ఏళ్లలో ఇదే మొదటిసారని అధికారులు చెబుతున్నారు. మరోవైపు పొన్నేరి, అవడి ప్రాంతాల్లో ఏకధాటిగా వానలు పడుతున్నాయి. భారీ వర్షాల కారణంగా జనజీవనం పూర్తిగా స్థంభించిపోయింది. రోడ్లపై భారీగా వరదనీరు చేరడంతో ప్రధాన కూడళ్లలో కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నవంబర్ 13 వరకు తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా.. తమిళనాడులోని పలు రోడ్లు, ఇళ్లు జలదిగ్భంధంలో చిక్కుకున్నాయి. తిరువళ్లూరు. కాంచీపురంలో చెన్నై వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ద్రోణి ప్రభావంతో.. ఈ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సముద్రంలో అలల ఉధృతి నేపథ్యంలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. మరోవైపు.. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. నవంబర్ 12 ఉదయం వరకు ఇది వాయువ్య దిశగా తమిళనాడు-పుదుచ్చేరి తీరాల వైపు వెళ్లే అవకాశం ఉంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి నవంబర్ 12, 13 తేదీల్లో తమిళనాడు -పుదుచ్చేరి, కేరళ మీదుగా వెళ్లే అవకాశం ఉందని.. వాతావరణ శాఖ పేర్కొంది. తమిళనాడులో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు ప్రాంతాలో నీట మునిగాయి. చెన్నైలో రాత్రి కురిసిన వర్షానికి రోడ్లన్ని చెరువులను తలపిస్తున్నాయి. పులియంతో ప్రాంతంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జరగాల్సిన ఐదు పెళ్లిళ్లు ఆలస్యం అయ్యాయి. పెళ్లివేడుకల కోసం ఆలయం ముందు బంధువులు బారులుతీరారు. వర్షాలకు ఆలయంలోకి భారీగా వరదనీరు వచ్చాయి. దీంతో వివాహ వేడుకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. పెళ్లి చేసుకునే జంటలు వర్షంలో తడుస్తూ... వరదనీటిలోనే ఆలయానికి చేరుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# ప్రధాని పర్యటనకు కెసిఆర్‌ను ఆహ్వానించరా:బాల్క



**పెద్దపల్లి,నవంబర్11(సమ సమాజం):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించకపోవడం అవమానకరమని ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... గతంలో రెండుసార్లు పీఎం వచ్చినప్పుడు సీఎం కేసీఆర్, మంత్రులను ఆహ్వానించలేదని తెలిపారు. ప్రధాని పర్యటన సందర్భంగా గెస్ట్ ఆఫ్ హానర్‌గా సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించవలసి ఉంటుందని చెప్పారు. బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు సిగ్గు లేదా.. ఎంతకాలం చెప్పులు, బూట్లు మోస్తారని యెద్దేవా చేశారు. తెలంగాణపై ప్రధాని వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నారని అన్నారు. ఎప్పుడో ప్రారంభం అయిన ఎరువుల కర్మాగారాన్ని ఇప్పుడు జాతికి అంకితం చేయడం ఏమిటని ప్రశ్నించారు. దమ్ముంటే తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు.

# మునుగోడు వల్ల డాక్టర్ పోస్టుల భర్తీలో ఆలస్యం

**వారం రోజుల్లో నియామకాలు పూర్తి: మంత్రి హరీష్**



**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక వల్లే డాక్టర్ పోస్టుల భర్తీ ఆలస్యమైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. వారం రోజుల్లో 969 పీహెచ్ సీ డాక్టర్ల సర్టిఫికేట్లు వెర్గి÷ చేసి తొందర్లోనే నియామక పత్రాలు అందజేస్తామన్నారు. హైదరాబాద్ కోఠిలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కార్యాలయంలో తెలంగాణ మానిటరింగ్ హబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన హరీశ్.. 4500 పల్లె దవాఖానలో 2900 ఏఎన్ఎమ్ సబ్ సెంటర్లుగా మార్చుతున్నామన్నారు. 3800 గ్రామాల్లో డాక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. 1569 ప్లలె దవాఖానల్లో పోస్టుల భర్తీ ఎన్నిక వల్ల ఆలస్యం అయ్యిందన్నారు. బస్తీ దవాఖానలను 15వ ఆర్థిక సంఘం ప్రశంసించిందని హరీశ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్లలె దవాఖానాలను ప్రారంభిస్తామన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పనితీరు పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ శ్వేత మహంతి, హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డీఎమ్ఈ రమేశ్ రెడ్డి పాల్గొన్నారు.

# రాజీవ్ హంతకులకు ఇక స్వేచ్ఛ

**జైలునుంచి విడుదల చేయాలన్న సుప్రీం ఆదేశం**



**న్యూఢిల్లీ,నవంబర్11(సమ సమాజం):** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆరుగురు నిందితులను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గతంలో హత్య కేసులో నిందితుడిగా ఉన్న పెరారివాలన్ కు నిర్దేశించిన విధానాలనే మిగిలిన దోషులకు కూడా వర్తిస్తాయని తెలిపింది. 2022 మే 18న పెరరివాలన్ ను విడుదల చేస్తూ ఇచ్చిన తీర్పును మిగిలిన దోషులకు కూడా వర్తింపజేసింది సుప్రీంకోర్టు.దీంతో దోషులు నళిని, జయకుమార్, ఆర్పీ రవిచంద్రన్, రాబర్ట్ పియాస్, సుతేంద్ర రాజా, శ్రీహరన్ లను విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది. దోషులు జైలులో మంచి నడవడికతో ఉన్నారని, జైలులో ఉన్న సమయంలో వివిధ డిగ్రీలు పూర్తి చేశారని కోర్టు తెలిపింది. అలాగే సెప్టెంబర్ 9, 2018లో దోషులను విడుదల చేయాలంటూ అప్పటి తమిళనాడు కేబినెట్ కూడా సిఫారసు చేసినట్లు కోర్టు తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. ఈ కేసులో ఆరుగురు దోషులు జీవిత ఖైదును అనుభవిస్తున్న సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు సంచలన తీర్పుతో రాజీవ్ గాంధీ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఎస్ నళిని, జయకుమార్, ఆర్‌పీ రవిచంద్రన్, రాబర్ట్ పయస్, సుధేంద్ర రాజా, శ్రీధరన్‌లకు జైలు జీవితం నుంచి విముక్తి లభించింది. వీరంతా జైలులో మంచి నడవడికతో ప్రవర్తించారని, అంతేకాకుండా వేర్వేరు డిగ్రీలు సాధించారని అత్యున్నత న్యాయస్థానం గుర్తించింది.ఈ దోషులను జైలు నుంచి విడుదల చేయాలని 2018 సెప్టెంబరు 9న తమిళనాడు రాష్ట్ర మంత్రివర్గం సిఫారసు చేసిందని, తమకు శిక్ష తగ్గించాలని ఆ రాష్ట్ర గవర్నర్‌కు దోషులు విజ్ఞప్తి చేశారని సుప్రీంకోర్టు గుర్తించింది. మంత్రివర్గ అభిప్రాయానికి గవర్నర్ కట్టుబడి ఉండవలసి ఉంటుందని పేర్కొంది. నళిని ప్రస్తుతం పెరోల్‌పై ఉన్నారు. ఆమె పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. అనంతరం ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 30 సంవత్సరాలకు పైగా జైలు శిక్ష అనుభవించిన ఏజీ పెరరివలన్‌ను విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో నళిని ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.

# నెలాఖరులో బన్సీలాల్ పేట మెట్లబావి ప్రారంభం

**మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ వెల్లడి**




**హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):** ఈనెలాఖరులో బన్సీలాల్ పేట మెట్లబావిని ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శుక్రవారం బన్సీలాల్ పేటలోని పురాతన మెట్లబావి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ తో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే పురాతన కట్టడాల పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది. మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు చొరవతో మెట్లబావి పునరుద్దరణ జరుగుతుంది. మెట్లబావి పరిసరాలను గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

# చీపురు పట్టిన బిజెపి ఎమ్మెల్యే సోలంకి

**టిక్కెట్ దక్కక పోవడంతో ఆప్‌లో చేరిక**



**గాంధీనగర్,నవంబర్11(సమ సమాజం):** గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే కేసరిసింహ సోలంకి బీజేపీకి రాజీనామా చేసి ఆమ్ ఆద్మీ పార్టీ లో చేరారు. ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ ఇటాలియా సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. మాతర్ అసెంబ్లీ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేసరిసింహకు ఈ సారి బీజేపీ టికెట్ కేటాయించలేదు. ఆయన స్థానంలో కల్పేష్ పర్మార్‌ను బీజేపీ బరిలోకి దించడంతో సోలంకి పార్టీ మారారు. అటు ఆప్ ఇప్పటికే మాతర్ అసెంబ్లీ స్థానానికి మహిపత్‌సింగ్ చౌహాన్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. 160 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను బీజేపీ గురువారం విడుదల చేసింది. డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 8న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. గత 27 ఏళ్లుగా గుజరాత్‌లో బీజేపీ అధికారంలో ఉంది. ఆ పార్టీ ఏడోసారి అధికారం కోసం ప్రయత్నిస్తోంది. బీజేపీని గద్దెదించాలని కాంగ్రెస్, ఆప్ ప్రయత్నాలు చేస్తున్నాయి.

# రుషికొండపై జోక్యం చేసుకోలేం

**హైకోర్టు విచారణలో ఉందన్న సుప్రీం**

**న్యూఢిల్లీ,నవంబర్11(సమ సమాజం):** రుషికొండపై హైకోర్టులో విచారణ జరుగుతున్నందున ఈ దశలో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రభుత్వ చర్యలపై అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటీషనర్ ఎంపీ రఘురామకు సుప్రీం ధర్మాసనం సూచించింది. హైకోర్టు ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినందున అక్కడ విచారణ పూర్తయిన తరువాతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ధర్మాసనం తెలిపింది. పర్యావరణ అనుమతులను ఉల్లంఘించి రుషికొండపై ఏపీ ప్రభుత్వం నిర్మాణాలు చేపడుతోందంటూ ఎంపీ రఘురామ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు ఆదేశాలను కూడా పాటించడం లేదన్నారు. రుషికొండపై నిర్మాణాలకు వెంటనే స్టే విధించాలని కోరారు. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్. ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది.

## దక్షిణాదిలో తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్

(మొదటి పేజి తరువాయి) కర్ణాటక ప్రభుత్వం రైల్వే మంత్రిత్వ శాఖ కలిసి కర్నాటక నుంచి కాశీకి యాత్రికులను పంపించేందుకు భారత్ గౌరవ్ పథకం కింద ఈ రైలును తీసుకువచ్చింది. కాశీ, అయోధ్య, ప్రయాగ్ రాజ్ లను సందర్శించడానికి యాత్రికులకు సౌకర్యవంతంగా ఉండేలా దీన్ని రూపొందించారు. అంతకు ముందు బెంగళూరులోని విధాన సౌధలో కవి కనకదాసు, మహర్షి వాల్మీకి విగ్రహాలకు ప్రధాని మోడీ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## టిఆర్ఎస్‌లో చేరిన బిజెపి కార్పోరేటర్



(మొదటి పేజి తరువాయి) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లేష్‌యాదవ్, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రామగుండానికి ప్రధాని మోడీ రాక

(మొదటి పేజి తరువాయి) గంటల వరకు ఈ రూట్స్ ని అవాయిడ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రధాని మోడీ నేటి మధ్యాహ్నం 1.30కి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. బీజేపీ లీడర్లు, కార్యకర్తలు ప్రధానికి ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడే బీజేపీ ముఖ్య నేతలతో మోడీ కాసేపు మాట్లాడుతారు. తర్వాత 2.15 గంటలకు ఎంఐ17 హెలికాప్టర్‌లో రామగుండం బయలుదేరి వెళ్తారు. మధ్యాహ్నం 3.30కు రామగుండం ఎరువులు, రసాయనాల పరిశ్రమ (ఆర్ఎఫ్‌సీఎల్)ను ప్రధాని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.15కి పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం రామగుండంలోని ఎన్టీపీసీ గ్రౌండ్‌లో జరి గే బహిరంగ సభలో మోడీ మాట్లాడుతారు.

## హిమాచల్ ఓటర్లకు ప్రధాని మోడీ వినతి

(మొదటి పేజి తరువాయి) బీజేపీ అధికారంలోకి రావాలని మోడీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో కేంద్రం అమలు చేస్తున్న పథకాన్ని కాంగ్రెస్ అడ్డుకుంటోందని ప్రధాని మోడీ ఆరోపించారు.'నేను 2014లో ప్రధానిగా ఎన్నికైనప్పుడు హిమాచల్ ప్రదేశ్‌లో వేరే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ కేంద్రం పథకాలను అడ్డుకున్నారు. 2017లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడే అభివృద్ధి శరవేగంగా ప్రారంభమైంది. దీన్ని ఇప్పుడు ఆపవద్దని మోదీ కోరారు. ఉజ్వల పథకం, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రతి ఇంటికి రక్షితనీరు వంటి అనేక పథకాలను వేగవంతం చేశామని, ఇప్పుడు వాటి ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు.నాడు వలసలు, కష్టాలకు బదులు ప్రగతికి, పర్యాటకానికి కేంద్రంగా మారాయని, పరిశ్రమల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రంలో వ్యవసాయం, ఉద్యానవన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని మోదీ చెప్పారు. హిమాచల్ రాష్ట్ర ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు వేయాలని విజ్ఞప్తి చేసిన ప్రధాని మోదీ ప్రతి ఓటు తనను మరింత బలోపేతం చేస్తుందన్నారు.హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం గురువారం ముగిసింది. ఈ ఎన్నికల్లో బీజేపీ,కాంగ్రెస్, ఆప్ పార్టీల మధ్య త్రిముఖ పోరు సాగింది.

## రాష్ట్రంలో ప్రాథమిక వైద్యరంగం బలోపేతం



(మొదటి పేజి తరువాయి) పీహెచ్‌సీల మరమ్మతలను రూ.43.18కోట్లతో చేపట్టినట్లు చెప్పారు. 1239 సబ్ సెంటర్ల కొత్త భవనాలకు మంజూరు ఇచ్చామని, ఒక్కోదానికి రూ.20లక్షల ఖర్చు చేస్తున్నామన్నారు. అన్నింటికి కలిపి మొత్తంగా రూ.247 కోట్లు వెచ్చించామన్న ఆయన.. 1,497 సబ్ సెంటర్లను 59 కోట్లతో మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు. ÷ఎనుగోడు ఎన్నికతో డాక్టర్ల నియామక ప్రక్రియ ఆలస్యమైందని, 969 పోస్టులకు మెరిట్ లిస్ట్ ప్రకటించినట్లు వివరించారు. వారం పది రోజుల్లో నియామక పత్రాలు అందజేస్తామన్నారు. దీంతో అన్ని పీహెచ్‌సీలో వైద్యులు ఉంటారని, పల్లె దవాఖానాల కోసం 1,569 పోస్టుల నియామక ప్రక్రియ త్వరలో మొదలవుతుందన్నారు. రాష్ట్రంలో 331 బస్తి దవాఖానలు పని చేస్తున్నాయని, వీటిని 500కు పెంచాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఇప్పటివరకు 2.11 కోట్ల ఓపీ నమోదైందని, వీటి వల్ల ఉస్మానియా, గాంధీ, ఫీవర్ వంటి హాస్పిటల్లపై ఒత్తిడి తగ్గిందన్నారు. 2019లో ఉస్మానియా హాస్పిటల్‌లో 12 లక్షలు ఓపీ ఉంటే.. ఈ ఏడాది 5 లక్షలకు తగ్గిందన్నారు. గాంధీలో 6.5లక్షల నుంచి 3.70 లక్షలకు, నిలోఫర్‌లో 8 లక్షల నుంచి 5.5 లక్షలకు, ఫీవర్ హాస్పిటల్‌లో 4 లక్షల నుంచి 2 లక్షలకు తగ్గిందన్నారు. ఫలితంగా అక్కడ సర్జరీల పెరిగాయన్నారు. తెలంగాణ డయాగ్నస్టిక్స్ ద్వారా ఇప్పటివరకు 36.20 లక్షల మందికి 6.46 కోట్ల టెస్టులు చేసినట్లు మంత్రి వివరించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా ఏడాది పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని, ప్రజలకు సేవ చేసానన్న సంతృప్తి కలిగిందని తెలిపారు. స్టాఫ్ నర్స్, 1165 స్పెషలిస్ట్ డాక్టర్ నోటిఫికేషన్ త్వరలో ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం 157 మెడికల్ కాలేజీలు మంజూరు చేసినా.. ఇందులో తెలంగాణకు ఒక్కటి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇచ్చినా తీసుకుంటామని, స్వయంగా నేనే పత్రాలు తీసుకొని వెళ్లానన్నారు. కిషన్ రెడ్డి చొరవ తీసుకుంటారా? ప్రశ్నించారు. ఇదిలా ఉండగా.. మానిటరింగ్ హబ్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి కుషాయిగూడ, సూర్యాపేట జిల్లా అంబేద్కర్‌నగర్, సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడారు. హరిత, అన్నపూర్ణ అనే పేషెంట్లతో మాట్లాడి, సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనవాసరావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మునుగోడు హామీలను నెరేవర్చే వరకు వెంటపడతా



(మొదటి పేజి తరువాయి) నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని.. ఎవరూ అధైర్యపడొద్దని చెప్పారు. మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా గొల్లకురుమలకు 1,58,000 చొప్పున అకౌంట్లో వేసి.. అకౌంట్?ను ఫ్రీజ్ చేశారని మండిపడ్డారు. గొల్లకురుమ లకు మద్దతుగా ఈనెల 14న మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ, చండూరులో డిగ్రీ కాలేజీ ఏర్పాటు సహా ఉదయసముద్రం ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్నారు. ఉదయసముద్రం పూర్తి చేస్తే మునుగోడు మండలానికి 50వేల ఎకరాలకు నీరు అందుతుందన్నారు. బీజేపీని బలోపేతం చేయడానికి సూర్యాపేట నుంచి ప్రచారం చేపడతానని స్పష్టం చేశారు.

## మోడీ వస్తే ముఖం చాటేయడం దేనికి?

(మొదటి పేజి తరువాయి) ఆరోపించారు.కాళేశ్వరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తిస్తే కనీసం తెలంగాణ ప్రజలపై పడ్డ లక్ష కోట్ల భారం తగ్గేదని చెప్పారు. సీఎం కేసీఆర్ తీరుతో హక్కుగా పొందాల్సిన అవకాశాన్ని మనం వినియోగించుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ వస్తే సీఎం కేసీఆర్ ముఖం చాటు చేసుకోవడం ఎందుకు...? అని ప్రశ్నించారు. అనేకానేక సమస్యలపై నిలదీయడానికి ఇదో అవకాశంగా భావించాలన్నారు. కోల్ మైన్ ప్రయివేటైజేషన్ చేసే యాక్ట్ కు మద్దతు తెలిపింది కేసీఆర్ కాదా...? అని జీవన్ రెడ్డి నిలదీశారు. గతంలో కేసీఆర్ మోదీకి పరోక్షంగా మద్దతు తెలిపాడన్న ఆయన... కరీంనగర్ టూ హైదరాబాద్ జాతీయ రహదారి 8 లైన్ ప్రపోజల్స్ మోడీని అడిగే హక్కు లేదా..? అని ప్రశ్నించారు. అల్వాల్, జూబ్లీహిల్స్ ఫ్లై ఓవర్ కు అవసరమైన స్థలం కంటోన్మెంట్ నుండి కేటాయింపు చేయించాలన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్ట్ లకు కూడా జాతీయ హోదా ఎందుకు కేంద్రాన్ని అడగడం లేదన్నారు. ఇలాంటి సమస్యలన్నీ మోడీ దృష్టికి తీసుకువెళ్తే తెలంగాణపై వివక్ష ఉందో లేదో తెలిసేదని చెప్పారు. కేసీఆర్ ముఖం చాటేసి తెలంగాణ హక్కుల్ని సాధించుకునే అవకాశం దూరం చేస్తున్నారని ఆరోపించారు.

## నేడు హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు

(మొదటి పేజి తరువాయి) ఉదయం 8 గంటల నుంచి డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఎగ్జిట్ పోల్ అంచనాలను ప్రచురించడాన్ని నిషేధిస్తూ పోల్ ప్యానెల్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ంలోని సబ్-సెక్షన్ (ఎల్) కింద ఉన్న అధికారాలను వినియోగించుకుంటూ భారత ఎన్నికల సంఘం నవంబర్ 12 ఉదయం 8 గంటల నుంచి డిసెంబర్ 5 సాయంత్రం 5.30 గంటల మధ్య వ్యవధిలో ఏదైనా ఎగ్జిట్ పోల్ నిర్వహించడం, ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచురించడం లేదా ప్రసారం చేయడం, ఏదైనా ఎగ్జిట్ పోల్ ఫలితాలను నిషేధించారు' అని ఈసీ నోటిఫికేషన్ లో పేర్కొంది. రెండు రాష్ట్రాలఓట్ల లెక్కింపు డిసెంబర్ 8న జరగనుంది.

## ప్రధాని పర్యటనకు సిఎంను ఇలాగేనా పిలిచేది

(మొదటి పేజి తరువాయి) వినోద్ కుమార్ అన్నారు. సంబంధిత మంత్రికి లేఖ రాసి ఆహ్వానించారు తప్ప.. పీఎంవో నుంచి సీఎంకు మాత్రం ఆహ్వానం లేదన్నారు. పెండ్లి పత్రిక కూడా ఇంటికి వెళ్లి ఇస్తారని.. అలాంటిది కేవలం పోస్టులో లేఖ పంపారని వినోద్ తెలిపారు. ఎమ్మెల్యేల కొనుగోళ్ల ఇష్యూ నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈడీ దాడులు చేస్తున్నారన్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి గంగుల కమలాకర్ తో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఇదిలావుంటే మోడీకి భయపడే.. సీఎం కేసీఆర్ ప్రధాని పర్యటనకు రావడం లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. రైతులకు యూరియా కొరత తీర్చడానికి మోడీ ప్రభుత్వం రామగుండ ఫ్యాక్టరీని నిర్మించిందని తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందన్న వివేక్... ఒక్కో ఎకరానికి వేల రూపాయల సబ్సిడీని అందిస్తుందని తెలిపారు. రేపటి సభను విజయవంతం చేసి రైతుల్లో, ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపుతారన్నారు. మోడీ మీటింగ్ సభ ఏర్పాట్లను వివేక్ పరిశీలించారు. మోడీ శనివారం మధ్యా హ్నం 1.30కి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రధానికి బీజేపీ లీడర్లు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడే బీజేపీ ముఖ్య నేతలతో మోడీ కొద్దిసేపు మాట్లాడుతారు. తర్వాత 2.15 గంటలకు ఎంఐ?17 హెలికాప్టర్‌లో రామగుండం బయలుదేరి వెళ్తారు. మధ్యాహ్నం 3.30కు రామగుండం ఎరువులు, రసాయనాల పరిశ్రమ (ఆర్ఎఫ్‌సీఎల్)ను ప్రధాని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.15కి పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారని పీఎంవో పేర్కొంది. అనంతరం రామగుండంలోని ఎన్టీపీసీ గ్రౌండ్‌లో జరి గే బహిరంగ సభలో మోడీ మాట్లాడుతారు. రామగుండంలో ఆర్ఎఫ్‌సీఎల్‌తోపాటు మొత్తం రూ.9,500 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు పీఎంఓ తెలిపింది.

## రాజీవ్ హంతకుల విడుదల

(మొదటి పేజి తరువాయి) సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు దేశ స్ఫూర్తికి అనుగుణంగా వ్యవహరించకపోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటను విడుదల చేశారు. రాజీవ్ గాంధీ హత్యకేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఆరుగురు నిందితులను విడుదల చేయాలని ఇవాళ సుప్రీంకోర్టు ఆదేశించింది. గతంలో హత్య కేసులో నిందితుడిగా ఉన్న పెరారివాలన్ కు నిర్దేశించిన గైడ్ లైన్సే మిగిలిన దోషులకు కూడా వర్తిస్తాయని తెలిపింది. 2022 మే 18న పెరరివాలన్ ను విడుదల చేస్తూ ఇచ్చిన తీర్పును మిగిలిన దోషులకు కూడా సుప్రీంకోర్టు వర్తింపజేసింది. దీంతో దోషులు నళిని, జయకుమార్, ఆర్పీ రవిచంద్రన్, రాబర్ట్ పియాస్, సుతేంద్ర రాజా, శ్రీహరన్ లను విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది.

## నిజాం విద్యార్థుల తీరుపై సబిత అసహనం

(మొదటి పేజి తరువాయి) గతంలో ఎన్నడూ లేని విధంగా యూజీ విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి 100శాతం హాస్టల్ కల్పించేందుకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ఆందోళన విరమించి క్లాసులకు అటెండ్ కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.అయితే నిజాం కాలేజీకి అనుబంధంగా నూతనంగా నిర్మించిన హాస్టల్‌ను పీజీ విద్యార్థులకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ హాస్టల్‌ను తమకే కేటాయించాలని యూజీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ అంశంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. సమస్యను పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కేటీఆర్ సూచించారు. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓయూ వీసీ రవీందర్ యాదవ్, నిజాం కాలేజీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనంలో 50 శాతం సీట్లను యూజీ విద్యార్థినులకు, మరో 50 శాతం సీట్లను పీజీ విద్యార్థినులకు కేటాయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని నిజాం కాలేజీ ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అయితే నిజాం కాలేజ్ హాస్టల్ వివాదం ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా కనిపించడంలేదు. కొత్త హాస్టల్ నిర్మాణం, ప్రస్తుతం ఉన్న గర్ల్స్ హాస్టల్ లో యూజీ స్టూడెంట్స్ కు 50శాతం వసతి కల్పించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చినా విద్యార్థినులు మాత్రం అందుకు అంగీకరించడం లేదు. హాస్టల్ ను 100శాతం తమకే కేటాయించే వరకు పోరాటం కొనసాగిస్తామని తేల్చి చెబుతున్నారు.

## గ్రానైట్ దాడులపై ఇడి ప్రకటన

### కోటి 8 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం): రాష్ట్రంలోని గ్రానైట్ ఏజెన్సీలో దాడులపై ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారిక ప్రకటన రిలీజ్ చేసింది . ఈ నెల 9, 10తేదీల్లో జరిగిన సోదాల్లో రూ. కోటి 8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. చైనా, హాంకాంగ్, సింగపూర్ తో పాటు మరికొన్ని దేశాలకు అక్రమంగా గ్రానైట్ ఎక్స్ పోర్ట్ చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎగుమతి పన్నులను ఎగవేస్తూ అడ్డదారిలో డబ్బు పొందినట్లు ఆధారాలు సేకరించినట్లు ఈడీ ప్రకటనలో తెలిపింది. శ్వేతా గ్రానైట్స్, శ్వేతా ఏజెన్సీస్, శ్రీ వేంకటేశ్వర గ్రానైట్స్..పీఎస్ఆర్ గ్రానైట్స్, అరవింద్ గ్రానైట్స్, గిరిజా షిప్పింగ్ ఏజెన్సీస్.. హవాలా కార్యకలాపాలకు పాల్పడ్డట్లు ఈడీ పేర్కొంది. ఈ గ్రానైట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పేరుతో బినామీ అకౌంట్లు ఉన్నట్లు గుర్తించారు. గ్రానైట్ దందాలో చైనా హవాలాపై ఆరా తీస్తున్నట్లు ఈడీ తెలిపింది.

# తెలంగాణపై ఢిల్లీ గద్దల కళ్లు



**కెసిఆర్ లేకుంటే ఆగమై పోతాం**
**దేశంలో ఉన్న ధాన్యాన్ని కూడా కొనే దమ్మున్న కెసిఆర్**
**కెసిఆర్ రాక ముందు తెలంగాణ ఎట్లుండెనో ఆలోచించాలి**
**ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మంత్రి గంగుల**

కరీంనగర్,నవంబర్11(సమ సమాజం): నరదృషి పడితే బండలు పగిలే పరిస్థితి అని.. ఢిల్లీ పాలకుల కన్ను తెలంగాణపై పడిందని పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రస్తుతం కల్లాల వద్దకే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు నేరుగా రైతుల అకౌంట్లలో డబ్బు జమవుతోందన్నారు. కేంద్రం వ్యవసాయ మోటార్లకు మీటర్లు తెచ్చే ప్రయత్నం చేస్తోందని.. మోటార్లకు మీటర్ల పెట్ట అని చెప్పిన వ్యక్తి సీఎం కేసీఆర్ అన్నారు. మళ్లీ విషం చిమ్ముతూ ఢిల్లీ గద్దలు వాలుతున్నాయని.. ఇక్కడి నీళ్లు, విద్యుత్, బొగ్గును తరలించుకుపోయేందుకు చూస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు ఎన్ని ప్రభుత్వాలు మారినా అందరం అరిగోసపడ్డామన్నారు. కేసీఆర్ లేకపోతే రాష్ట్ర పరిస్థితి ఎంటని ఒకసారి ఆలోచించాలన్నారు. పిల్లలు, రాష్ట్ర భవిష్యత్తు ఎలా ఉండేదో ఆలోచించాలన్నారు. మళ్లీ పంటలు ఎండిపోయి.. గుడ్డిదీపం అయ్యే పరిస్థితి ఉందని హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఓట్ల కోసం వస్తారని.. వారంతా ఢిల్లీకి గులాములని.. కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. కేసీఆర్ ధర్మం వైపు.. ప్రజల వైపు ఉన్నారని, దేశం మొత్తంలో పండించిన ప్రతీ గింజను కొనే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఇక్కడ అవసరం అనుకుంటే అక్కడే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. తాను రైతు బిడ్డనే అని.. ఆనాడు నీళ్లు లేక ఉన్న భూమిలో సగం బీడుగా వదిలేసే వారమని గుర్తు చేశారు. కరెంట్ లేక, నీళ్లు లేక రైతు అప్పులపాలై.. అనేక ఇబ్బందులు పడ్డామని.. పక్కనే చెరువులు ఉన్నా ఎండిపోయాయన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే ఇప్పుడు నీళ్లు నిండుగా ఉన్నాయన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసినా రైతులు సంతోషంగా ఉన్నారని, రైతుబంధు, రైతుబీమా ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని స్పష్టం చేశారు. ఇప్పుడు భూమికి బరువయ్యేంత పంట పండుతోందని.. దండం లేదు.. దరఖాస్తు లేదన్నారు. గతంలో ధాన్యం అమ్మాలన్నా.. కొనుగోలు చేయాలన్నా ఇబ్బందులు పడాల్సి వచ్చేదని.. ఎక్కడ చూసినా రైతన్నల ఆత్మహత్యలు జరిగేవన్నారు. దేశం మొత్తంలో పండించిన ప్రతీ గింజను కొనే ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని మంత్రి గంగుల కమాలకర్ అన్నారు. కరీంనగర్ జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. రాష్ట్రం ఏర్పడక ముందు ఎన్నో అరి గోసలు పడ్డామని కానీ ఇప్పుడా పరిస్థితి లేదని గంగుల అన్నారు. కేసీఆర్ ముందుచూపుతో కాళేశ్వరం ప్రాజెక్టు కడితే ఇప్పుడు నిండుగా నీళ్ళు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతులు సంతోషంగా ఉన్నారని, భూమికి బరువు అయ్యే అంత పంట పండుతోందని గంగుల తెలిపారు. దండం, దరఖాస్తులు లేకుండానే రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతున్నాయన్నారు. ఢిల్లీ పాలకుల కళ్ళు తెలంగాణ మీద పడిందని.. ఇక్కడి నీళ్ళు, విద్యుత్, బొగ్గులను తీసుకెళ్లాలని చూస్తున్నారని గంగుల ఆరోపించారు. కేసీఆర్ లేకపోతే రాష్ట్ర పరిస్థితి ఎంటో ఒక్కసారి అలోచించుకోవాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి అండగా ఉండాలని సూచించారు.

# తెలంగాణ అభివృద్ధికి మోడీ కృషి

**అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న సిఎం కెసిఆర్**
**మోడీ పర్యటనలో లెఫ్ట్ నేతలను ఉసిగొల్పుతున్నారు**
**కెసిఆర్ తీరుపై మండిపడ్డ బిజెపి లక్ష్మణ్**




హైదరాబాద్,నవంబర్11(సమ సమాజం):తెలంగాణ అభివృద్ధికి ప్రధాని మోడీ కృషి చేస్తుంటే...కేసీఆర్ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ డా. లక్ష్మణ్ మండిపడ్డారు. మంత్రి కిషన్ రెడ్డితో కలసి మాట్లాడుతూ..కేసీఆర్ కావాలనే ప్రధాని మోడీ పర్యటనకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, సీఎంగా ఎంతో రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్..రాజకీయ, ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యత్యాసాన్ని గుర్తించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు నష్టం చేకూర్చే విధంగా కేసీఆర్ శైలి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత కార్మికులపై ప్రేమ ఒలకపోస్తున్న కేసీఆర్.. కొండా లక్ష్మణ్ బాపూజీని ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. మలిదశ ఉద్యమంలో ఢిల్లీలో దీక్ష చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీకి కనీసం మద్దతు తెలపలేదన్నారు. ఎన్నో త్యాగాలు చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును తెలంగాణలో లేకుండా చేయాలని కేసీఆర్ చూశారని వెల్లడించారు. ÷ామగుండం ఎరువుల కర్మాగారం ద్వారా రాష్ట్రంలో రైతులకు, యువతకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కానీ ప్రధాని పర్యటనను కేసీఆర్ రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీతో రాజకీయంగా విభేదించినా...ప్రభుత్వ కార్యక్రమానికి హాజరవ్వాలని చెప్పారు. ప్రధాని పర్యటనలో కేసీఆర్ పాల్గొంటే..తెలంగాణ అభివృద్ధి కోసం మోడీకి మరిన్ని వినతులు అడిగే అవకాశం లభిస్తుందన్నారు. అటు కేసీఆర్ కమ్యూనిస్టులను ఉసిగొల్పు తున్నారని ఆరోపించారు. మోడీ రావద్దని బ్యానర్లను కట్టిస్తున్నారని ..దీని ద్వారా ఏం సాధిస్తారని ప్రశ్నించారు. చేనేత కార్మికుల పట్ల చిత్త శుద్ధి ఉంటే..రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న జీఎస్టీని కార్మికులకే ఖర్చు చేయాలన్నారు. 40 లక్షల టర్నోవర్ కలిగిన చేనేత కార్మికులపై జీఎస్టీ విధించొద్దని కేంద్రం స్పష్టం చేస్తే..కేసీఆర్ మాత్రం..25 లక్షల టర్నోవల్ కలిగిన చేనేత కార్మికులపై ట్యాక్స్ వసూలు చేస్తున్నారి వెల్లడించారు. మోడీ ప్రధాని అయిన తర్వాత వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నారని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు రాయితీ ఇస్తున్నారని చెప్పారు. గతంలో తెలంగాణలో ఎరువుల కోసం గతంలో రైతులు కొట్లాడారని గుర్తు చేశారు. లైన్లలో చెప్పులు పెట్టి మరీ ఎరువులు కొనుగోలు చేశారన్నారు. రైతులకు అలాంటి పరిస్థితి రావద్దనే ఉద్దేశంతో కేంద్రం రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని నిర్మించిందన్నారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. కాబట్టి కేసీఆర్ ఇప్పటికైనా మనసు మార్చుకుని ప్రధాని పర్యటనలో పాల్గొనాలని సూచించారు.

